క్లుప్తంగా

జెడ్పీ నిధులతో అభివృద్ధి



బోరు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ మంజుల

తాండూరు రూరల్: జిల్లా పరిషత్ నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని జెడ్పీటీసీ గౌడి మంజుల అన్నారు. శనివారం మండల పరిధి అంతారం తండా, ఉద్దాండపూర్, చెంగోల్, చింతమణిపట్నం, పర్వాతపూర్, గౌతపూర్ గ్రామాల్లో బోర్లు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చైర్ పర్సన్ సునితారెడ్డి కృషితో గ్రామాలను అభివృద్ధి చేస్తామని, అందులో భాగంగా శ్మశాన వాటికల్లో బోర్లు వేయిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గౌడి వెంకటేశం, నర్సింహులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కొడంగల్: తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘ్ క్యాలెండర్‌ను శనివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆవిష్కరించారు. ఇందులో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, సామాజిక కార్యకర్త మురహరి వశిష్ట, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, మున్సిపల్ కౌన్సిలర్ శంకర్ నాయక్, మున్సిపల్ కో ఆప్షన్ మునీరు, పెద్దనందిగామ మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, తార్యా నాయక్, సూర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ రికవరీ

పూడూరు: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ యాప్‌ద్వారా ట్రేస్ చేసి, ఫోన్‌ను బాధితుడికి అందజేసిన సంఘటన చన్గోముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. పూడూరు మండలం తుర్క ఎన్కేపల్లి గ్రామానికి చెందిన పర్శమోని తిర్మలేశ్, తన సెల్‌ఫోన్ పోయిందని ఠాణాలో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. సీఈఐఆర్ యాప్ ద్వారా మొబైల్ ఆచూకీ కనుగొని, బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విలువైన సెల్‌ఫోన్‌లను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు.

బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ పండితులు శ్రీమాన్ ధరూర్ శ్రీనివాసాచార్యులు

కొడంగల్ రూరల్: బ్రాహ్మణులు సంఘటితంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలని శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ పండితులు శ్రీమాన్ ధరూర్ శ్రీనివాసాచార్యులు అన్నారు. శనివారం పట్టణంలోని నగరేశ్వర స్వామివారి దేవాలయంలో శంకర సేవా సమితి 4వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీమాన్ మాట్లాడారు. బ్రాహ్మణులు పురోహితంతో పాటు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కల్యాణరావు, లక్ష్మీనారాయణ జ్యోషి, కిట్టుస్వామి, సభాపతి కుటుంబ సభ్యులు, నందారం శ్రీనివాసుగుప్తా, సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి

ఎంపీడీఓ వినయ్‌కుమార్

షాద్‌నగర్: ప్రజాపాలనలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను ఈ నెల 6 నుంచే ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ ప్రారంభించినట్లు ఎంపీడీఓ వినయ్‌కుమార్ పేర్కొన్నారు. మొత్తం దరఖాస్తులను శుక్రవారం సాయంత్రం వరకు ఆన్‌లైన్ నమోదు చేసి పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ కోసం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంతో పాటు, ఠాగూర్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కంప్యూటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీని కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించి ఆన్‌లైన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. చాలా మంది మహాలక్ష్మి, గృహజ్యోతి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాల కోసం దరఖాస్తులు చేసుకున్నట్లు ఆయన వివరించారు.

తప్పులు సరిచేసుకోండి

కొందుర్గు: ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే సరి చేసుకోవాలని తహసీల్దార్ రమేష్ కుమార్ సూచించారు. శనివారం రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల పరిధి 22 గ్రామ పంచాయతీలకు సంబంధించి 26 పోలింగ్ బూత్‌ల ఓటరు జాబితాను విడుదల చేశారు. డీటీ కృష్ణయ్య, ఆర్ఐ ఉన్నారు.



మోమిన్‌పేట: అక్షితలను పంపిణీ చేస్తున్న రామ భక్తులు



కొడంగల్ రూరల్: వడ్డర్‌గల్లీలో..

ఊరూరా రామనామం

- ఇంటింటికీ అయోధ్య అక్షితల పంపిణీ
- విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో ఊపందుకున్న కార్యక్రమం



పరిగి: మిట్టకోడూర్ అక్షితలను పంపిణీ చేస్తున్న రామ భక్తులు

పరిగి: ఈ నెల 22న అయోధ్యలో బాల రాముడు విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్న నేపథ్యంలో ఊరూరా.. శ్రీరామ నామ జపం మారుమోగిపోతోంది. పుణ్యక్షేత్రం నుంచి వచ్చిన అక్షితలను రామ భక్తులు జిల్లా వ్యాప్తంగా గ్రామగ్రామాన ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. అందులో భాగంగా మండల పరిధి మిట్టకోడూర్ తదితర గ్రామాల్లో శనివారం ఇంటింటికీ అందజేశారు. తొలుత అక్షితలకు మాణిక్‌ప్రభు దేవాలయంలో ప్రత్యేకంగా పూజలు చేయించారు. అనంతరం రామనామ భజనలతో ఊరేగించి వితరణ చేపట్టారు. ఈ సందకర్భంగా కొందరు మాట్లాడుతూ విగ్రహాల ప్రాణప్రతిష్ఠాపనను పండుగలా జరుపుకోవాలని సూచించారు.

మేకవనంపల్లిలో..

మోమిన్‌పేట: మండల పరిధి మేకవనంపల్లిలో అయోధ్య నుంచి వచ్చిన అక్షితలను పలువురు రామ భక్తులు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. 22న ప్రాణప్రతిష్ఠ అయిన తర్వాత అక్షితలను తలపై వేసుకొని, 108సార్లు జైశ్రీరాం అనాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భజన భక్తులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: శ్రీరాములవారి పూజిత అక్షితలను పట్టణంలోని వడ్డర్‌గల్లి, మండల పరిధి సంఘాయిపల్లి గ్రామాల్లో హిందూవాహిని కార్యకర్తలు ఇంటింటికీ పంపిణీ చేశారు. తొలుత స్థానిక చితారు పెరుమాళ్ల ఆంజనేయస్వామివారి దేవాలయంలో అక్షితలకు అర్చకులు వెంకుస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హిందూవాహిని కార్యకర్తలు రాములవారి భజనలు చేస్తూ ఇంటింటికీ పూజిత అక్షితలను పంపిణీ చేశారు. సంఘాయిపల్లిలో హిందూ కార్యకర్త రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో అక్షితలను పంపిణీ చేశారు.

ప్రతి ఇంటిలో దీపాలు

దోమ: అయోధ్య శ్రీరామమందిరం నుంచి వచ్చిన అక్షితలకు తొలుత రామ భక్తులు.. ఆంజనేయ స్వామి, సంజీవ స్వామి దేవాలయంలో అర్చకులతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం జై శ్రీరామ్ అంటూ మండల పరిధి దొంగ ఎన్కేపల్లి, లింగన్‌పల్లి తదితర గ్రామాల్లో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఈ నెల 22న అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందని తెలిపారు. అందుకు దేశం మొత్తం పండుగ చేసుకోనుందని, అందులో భాగంగా ప్రతి ఇంటిలో దీపాలను వెలిగించి రాముడికి పూజలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, లింగన్‌పల్లి సర్పంచ్, గ్రామస్తులు పిట్లరవి, శ్రీనివాస్, మహిపాల్, దస్తయ్య, అంజి, రాము, రాజు, జైపాల్, యాదయ్య, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: అయోధ్యలో శ్రీరామ ప్రాణప్రతిష్ఠతను పురస్కరించుకుని రాముడి అక్షితలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. తొలుత అక్షితలకు మండల పరిధి కుస్మసముద్రం గ్రామంలో హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు చేయించారు. అనంతరం ఇంటింటికీ అందజేశారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: సంక్రాంతి పండుగ పూట రాములోరి అక్షితలు గడప గడపకూ అందుతున్నాయి. అర్చకుల సంఘం జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారి చేతుల మీదుగా మండల పరిధి రేగడిమైలారంలో రెండు రోజులుగా అక్షితలు పంపిణీ చేస్తున్నారు. స్థానిక వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఆలయ కమిటీ సభ్యులు దశరథ్, మహేశ్, మహిపాల్, కృష్ణయ్య, శ్రీకాంత్, విశనాథం, మొగులయ్య, వీరప్ప తదితరులు ఉన్నారు.



దోమ: సంజీవ స్వామి ఆలయంలో అక్షితలకు పూజలు చేయిస్తున్న రామ భక్తులు



కుల్కచర్లలో..



బొంరాస్‌పేటలో..

ముదిరాజులు సంఘటితం కావాలి



ముదిరాజ్ నూతన కార్యవర్గం

మర్పల్లి: ముదిరాజులు సంఘటితంగా ఉండేందుకు గ్రామగ్రామాన నూతనంగా కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని ముదిరాజ్ సంఘం సీనియర్ నాయకుడు సంగన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంసీఎం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న ముదిరాజ్‌లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. ముదిరాజ్‌లకు ఉపాధి అవకాశాలు కల్పించి, బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని కోరారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పులుమద్ది రంజిత్, ఉపాధ్యక్షుడిగా తలారి తిరుపతి, సింగూరి పాండు, ప్రధాన కార్యదర్శిగా మందమీది నర్సింహులు, కార్యదర్శిగా ప్రశాంత్, కోశాధికారిగా అవినాశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా మహేందర్, నాగేశ్, సిద్దేశ్వర్, నర్సింహులును నియమించారు. అనంతరం నూతన అధ్యక్షుడు రంజిత్ మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా నియమించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. కులస్తుల సమస్యల కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రీడర్ స్కూల్ ప్రిన్స్‌పాల్ నారాయణ, రాజు, యశ్వంత్ తదితరులు ఉన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

యువత క్రీడల్లో రాణించాలి



కృష్ణను సన్మానిస్తున్న క్రీడా నిర్వాహకులు, ఆటగాళ్లు

కుల్కచర్ల: క్రీడల్లో రాణించడం వలన మానసిక ఉల్లాసం పెంపొందడంతో పాటు శారీరకంగా దృఢంగా ఉంటారని ముదిరాజ్ సంఘం చౌడాపూర్ మండల అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్ అన్నారు. శనివారం చౌడాపూర్ మండలం మరికల్ గ్రామంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. చదువుతో పాటు.. ఆటల్లో రాణించడం వలన బహుముఖ ప్రయోజనాలు ఉంటాయని, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని సూచించారు. ఈ సందర్భంగా 50మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి సాయి ముదిరాజ్, జయశంకర్ యూనివర్సిటీ నాయకులు వినయ్, పోరెడ్డి, రమేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

- మూడు రోజుల పాటు జరగనున్న వేడుకలు



ఉత్సవాలకు ముస్తాబైన వేంకటేశ్వర స్వామి దేవాలయం

కొందుర్గు: రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం సంజీవపురం చింతల్‌లో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలకు దేవాలయాన్ని ముస్తాబు చేశారు. ఏటా సంక్రాంతి సందర్భంగా ఉత్సవాలను నిర్వహిస్తారు. వేడుకలకు మండల పరిధి విశ్వనాథ్‌పూర్, వెంకిర్యాల, లక్ష్మిదేవిపల్లి నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ, ఫరూఖ్‌నగర్ మండలాలతో పాటు మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట, చౌడాపూర్ మండలాలకు చెందిన భక్తులు కూడా పెద్ద ఎత్తున హాజరవుతారని దేవాలయ కమిటీ చైర్మన్ రామకృష్ణ తెలిపారు. 15న ధ్వజారోహనం, గణపతి హోమం, శకటోత్సవం, రాత్రికి భజనలు, 16న స్వామివారి అభిషేకం, 17న రథోత్సవం, పల్లకీసేవ అలాగే దేవాలయ ఆవరణలో వెలసిన మైసమ్మ దేవతకు బండ్లు, బోనాల కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. 18న స్వామివారి కళ్యాణం, భజనలు, అన్నదానం నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ చైర్మన్ పేర్కొన్నారు. ఉత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎంపీ మన్నె శ్రీనివాసురెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్ పాల్గొననున్నారు.

సంక్రాంతికి.. ధరాఘాతం

- భగ్గుమంటున్న నిత్యావసరాలు
- ఇబ్బందుల్లో జనం



షాబాద్: మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోయాయి. సాధారణ రోజుల్లో పరిస్థితి ఇలా ఉంటే ఇక పండుగ సందర్భాల్లో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దీంతో పేదలు ఈ ధరల పెరుగుదలను చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏమి తినాలి.. ఏమి కొనాలి.. అంటూ వాపోతున్నారు. పండుగ రోజుల్లో ధరలు రెండింతలవుతున్నాయని వారు ఆవేదన చెందుతున్నారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు సంక్రాంతి జరుపుకోవాలంటే నిత్యవసర సరుకుల ధరల పోటు వారికి ఇబ్బందిగా తయారైంది. పెరుగుతున్న ధరలను నియంత్రించే వారు కరువయ్యారని, ఇలాంటి సందర్భాల్లో ప్రభుత్వాలు ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నిత్యావసరాలైన చింతపండు, ఉల్లిగడ్డ, ఉప్పుతో పాటు కూరగాయల రేట్లు విపరీతంగా పెరిగాయి. ఈ వస్తువులను సామాన్యుడు పండుగ పూట కొనాలంటే వారు ఇబ్బందులకు గురవుతున్నట్లు చెబుతున్నారు. నిత్యావసర సరుకులైన కిలో మంచి నూనె మార్కెట్‌లో రూ. 95 నుంచి 120లకు అమ్ముతున్నారు. శనగ పిండి కిలో రూ.90 నుంచి 95లకు, పెసరపప్పు రూ. 110 నుంచి 120లకు, కందిపప్పు రూ.150 నుంచి160లకు, మినపపప్పు రూ.130నుంచి 135లకు పెరిగింది. చింతపండు రూ.110 నుంచి 130గా ఉంది. ఉప్పు, ఉల్లిపాయలు, బియ్యం, పప్పులు, ఎండుమిర్చితో పాటు కూరగాయల ధరలు కూడా మార్కెట్లో రెండింతలుగా ఉంది. సంక్రాంతి వస్తుందంటే వారం రోజుల ముందే సందడి మొదలవుతుంది. కానీ ఈ సంవత్సరం పండుగకు బంధువులను ఇంటికి పిలవాలంటేనే పేదోడు జంక్కాల్సిన పరిస్థితులు దాపురించాయి. హిందూ సంప్రదాయం ప్రకారం ఆడపడుచులను పుట్టింటికి తీసుకరావడం ఆనవాయితీ. బంధు మిత్రులందరూ సొంత గ్రామాలకు చేరుకొని ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకుంటారు. కానీ ఈ సారి పండగ వాతావరణం అంతంతగానే కనిపిస్తుంది. పండుగకు కొద్ది రోజుల ముందు నుంచే గ్రామాల్లో ఆటల పోటీలు, పిండి వంటకాలతో సంబరాలు జరుపుకునేవారు. అయితే ఈ సారి పెద్దగా ఎవరు కూడా ఆసక్తి కనబరచడం లేదు. దీంతో వందలాది పేద కుటుంబాలు కనీసం సంక్రాంతి రోజైనా సంతోషంగా గడుపుదామనుకున్నా అందుకు పరిస్థితులు అనుకూలంగా లేవని వారు విచారం వ్యక్తం చేస్తున్నారు.

పంటలపై కాలుష్యం కాటు



సుద్ద నుంచి వెలువడిన దుమ్ముతో నిండిన పంట(ఫైల్)

- కర్షకుల కష్టార్జితం దుమ్ముపాలు
- సుద్ద పరిశ్రమతో ఏటా నష్టపోతున్న రైతన్నలు
- పుష్కర కాలంగా ఇదే దుస్థితి
- పట్టించుకోని అధికారులు



పాడైన పంటలను చూపిస్తున్న రైతులు (ఫైల్)

పెద్దేముల్: సుద్ద కాలుష్యం(డస్టు) వలన పంటలు దెబ్బతిని, నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. పుష్కర కాలంగా ఇదే దుస్థితి నెలకొందని, ఇదే విషయాన్ని పలు మార్లు కలెక్టర్, మండల రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవటం మండల పరిధి అన్నదాతలు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా సుద్ద పరిశ్రమ వలన అనారోగ్యం పాలవుతున్నామని మారేపల్లి కస్తూర్బాగాంధీ గురుకుల విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పరిస్థితిని ఎవరూ పట్టించుకోకపోవడంతో.. తాము బడి మానేయడం తప్పితే మరో మార్గం లేదని వాపోతున్నారు.

పెట్టుబడులు కోల్పోతున్నారు..

20 ఏళ్ల క్రితం నాటి ప్రభుత్వం భూమి లేని బాండెడ్ రైతులు సుమారు 20మందికి 24 ఎకరాల భూమిని ఓగ్లాపూర్–మారేపల్లి శివారులో పంపిణీ చేసింది. అందులో వారు సాగు చేస్తూ.. ఉపాధి పొందుతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. అదే ప్రాంతంలో ఉన్న సుద్ద పరిశ్రమ వలన కొన్నేళ్లుగా పంటలపై దుమ్ముపారి, పాడవుతున్నాయని, తద్వారా తాము నష్టపోతున్నామని బాధిత రైతులు చెప్పారు. పెట్టుబడులు కూడా దక్కడం లేదని పేర్కొంటున్నారు. రైతుబంధు పేరిట ప్రభుత్వం ఇచ్చే సాయం తప్ప, మరేమీ మిగలటం లేదంటున్నారు.

పరిహారం కోసం డిమాండ్

ప్రభుత్వం బాండెడ్ రైతులకు పంపిణీ చేసిన భూముల్లోనూ సుద్ద తవ్వకాలు జరిగాయన్న సమాచారంతో నాటి సబ్ కలెక్టర్ ఆమ్రపాలి స్పందించి, ఆ తవ్వకాలకు నిలిపి వేసింది. ఎవరికైతే ప్రభుత్వం భూమి ఇచ్చిందో.. వారే సాగుచేసుకొని ఉపాధి పొందాలని ఆదేశించారు. కాగా.. సుద్ద కాలుష్యంతో పంటలు పాడవుతున్న విషయాన్ని పలుమార్లు రెవెన్యూ, మైన్స్, వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేసినా.. ఎవరూ పట్టించుకోవటం లేదని, కొత్త ప్రభుత్వమైనా ఆ పరిశ్రమలను మూసివేయించి, తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి, ఎకరాకు రూ.25వేల నుంచి 30వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

పేదలను ఆదుకోవాలి

మొయినాబాద్/చేవెళ్ల: ప్రతిఒక్కరూ పేదలను ఆదుకోవాలని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై ఆసుపత్రిలో బిల్లు చెల్లించలేని స్థితిలో ఉన్న వ్యక్తికి ఆయన ఆర్థిక సహాయం అందజేశారు. చేవెళ్ల మండలం తంగడపల్లి గ్రామానికి చెందిన పూలపల్లి వంశీగౌడ్ కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఓ ఆసుపత్రిలో చేరాడు. విషయం తెలుసుకున్న ఎంపీ అతని కుటుంబ సభ్యులకు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు.



సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని వయోభేదం లేకుండా పతంగులు ఎగురవేసేందుకు ప్రజలు ఉత్సాహం చూపుతున్నారు. ఇందులో భాగంగా వికారాబాద్ పట్టణం మహాశక్తి టాకీస్ ప్రధానరోడ్డులో ఏర్పాటు చేసిన పతంగుల విక్రయ దుకాణాలు కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా అందంగా, ఆకర్షణీయంగా ఉండే కైట్లు, మాంజాలను కొనేందుకు యువకులు, చిన్నారులు ఆసక్తి చూపారు.

– అనంతగిరి

సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలి

పరిగి: సంస్కృతి సంప్రదాయాలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని పద్మడ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటిలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. సంక్రాంతి పండుగ అంటేనే సంబరాలు అని, పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మీర్ తోహిద్‌అలీ, నిర్వాహకురాలు అర్చన తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

కడ్తాల్: తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్(టీఎస్ఎస్ఓ) రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల అధ్యక్షుడిగా చరికొండకు చెందిన పాలకూర్ల రేవంత్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ మేరకు శనివారం టీఎస్ఎస్ఓ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో, టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని రేవంత్ చెప్పారు.

'మోడల్' నవోదయకు విశేష స్పందన



మోడల్ నవోదయ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన మోడల్ నవోదయ పరీక్షకు విశేష స్పందన లభించిందని నిర్వాహకులు, పాతకొడంగల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం క్రాంతికుమార్ తెలిపారు. కొడంగల్‌తో పాటు పరిసర గ్రామాలకు చెందిన విద్యార్థులు 50మంది పరీక్షకు హాజరయ్యారని ఆయన తెలిపారు. ఇలాంటి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షలపై అవగాహన పెరుగుతుందని అన్నారు.



స్తంభాల ఏర్పాటు చేయిస్తున్న ప్రజాప్రతినిధులు

హైమాస్ట్ లైట్ల పోల్స్ బిగింపు

తలకొండపల్లి: ఎమ్మెల్సీ గోరటి వెంకన్న నిధులు రూ. 8 లక్షలతో 4 పోల్స్‌ను బిగించినట్లు సర్పంచ్ లలిత, ఉప సర్పంచ్ అనిల్‌లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో శనివారం హైమాస్టు లైట్ల 4 స్తంభాలను బిగించారు. బస్టాండ్, వివేకానంద విగ్రహం, కమాన్, తదితర ప్రదేశాల్లో ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, జ్యోతయ్య, లక్ష్మన్ నాయక్, ఉప సర్పంచ్ అనిల్, ఎంపీటీసీ హేమరాజు, వార్డు సభ్యులు ఈశ్వర్, శ్రీను, వెంకటయ్య, సజ్జుపాష, యాదయ్య ఉన్నారు..